క్లుప్తంగా

మాజీ సైనికులకు సత్కారం



మాజీ సైనికులను సత్కరిస్తున్న శ్యామ్, రాజేష్ తదితరులు

రామచంద్రపురం రూరల్: జూనియర్ ఎన్టీఆర్ పుట్టిన రోజు వేడుకలను ఎన్టీఆర్ సేవా సమితి ఆధ్వర్యంలో మంగళవారం ద్రాక్షారామలో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. అనంతరం మాజీ సైనికులను ఘనంగా సత్కరించారు. ఇటీవలి యుద్ధంలో అసువులు బాసిన సైనికుడు మురళీనాయక్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ సేవాసమితి గౌరవాధ్యక్షుడు వాసంశెట్టి శ్యామ్, అధ్యక్షుడు సాదే రాజేష్, కార్యదర్శి శీలం మణికంఠ, సభ్యులు సుబ్బు, వీరకుమార్, చైతన్య, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

కపిలేశ్వరపురం: రామచంద్రపురం 132 కేవీ విద్యుత్ కేంద్రం, కొత్తపేట, ముమ్మిడివరం 132/33 కేవీ సబ్‌స్టేషన్ల పరిధిలోని లైన్లకు మరమ్మతులు చేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ రామచంద్రపురం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.రత్నాలరావు మంగళవారం తెలిపారు. ఆయా సబ్ స్టేషన్లకు ఎల్‌టీ లైన్ క్రాసింగ్ ఉన్న నేపథ్యంలో అంగర సబ్‌స్టేషన్ పరిధిలోని పలు గ్రామాలకు బుధ, గురువారాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. మండలంలోని కోరుమిల్లి, మాచర, వాకతిప్ప, నాగులచెరువు గ్రామాలకూ అంతరాయం ఉంటుందని తెలిపారు.

27 వరకు వేసవి వినోద కార్యక్రమాలు

రామచంద్రపురం: జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఈనెల 19 నుంచి 27 వరకు పిల్లా వారి వీధిలోని రాజీవ్‌గాంధీ మున్సిపల్ స్కూల్‌లో వేసవి వినోద కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు ముమ్మిడి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి జి.ఈశ్వరరావు, కోశాధికారి రహమన్ తదితరులు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వినోదం, విజ్ఞానాల మేళవింపుగా పిల్లలకు ఉపయోగకరంగా ఉండేలా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఆసక్తి గల విద్యార్థులు జనవిజ్ఞాన వేదిక కార్యవర్గ సభ్యులతో సంప్రదించాలని కోరారు.

బంగారు, వెండి ఆభరణాల చోరీ

కపిలేశ్వరపురం: ఇంటి తాళం పగులగొట్టిన దొంగలు స్థానిక వైఎస్సార్ కాలనీలో ఎం.పోసయ్య, నాగమణి దంపతుల నివాసంలో చోరీకి పాల్పడ్డారు. రూ.లక్ష విలువైన వెండి, బంగారు ఆభరణాలు అపహరించారు. ఇటీవల ఆ దంపతులు ఊరు వెళ్లారు. సోమవారం ఉదయం ఇంటికి వచ్చేసరికి తాళాలు పగలగొట్టి ఉన్నాయి. అదే రోజు అంగర పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇలాఉండగా అంగర పోలీస్ స్టేషన్ పరిధిలో ఇటీవల దొంగతనాలు ఎక్కువయ్యాయి. రాత్రివేళ వ్యవసాయ క్షేత్రాల్లోని సామగ్రిని తస్కరిస్తున్నారు. తరచూ జరుగుతున్న దొంగతనాలతో శివారు గ్రామ ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

నూతన వంతెనల నిర్మాణాలు పూర్తి చేయాలి

అమలాపురం రూరల్: జిల్లా కేంద్రంలో వాహనాల రాకపోకల రద్దీని నియంత్రించేందుకు యుద్ధ ప్రాతిపదికన నడిపూడి లాకులు ఈదరపల్లి వద్ద నూతన వంతెనల నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ రహదారులు భవనాల శాఖ ఇంజినీర్లను ఆదేశించారు. మంగళవారం అమలాపురం మండల పరిధిలోని ఈదరపల్లి, నడిపూడి లాకు వద్ద నూతనంగా నిర్మిస్తున్న వంతెన నిర్మాణ పనులను పరిశీలించారు. నిర్మాణ పనుల నిర్వహణ తీరుతెన్నులను ఇంజనీర్లను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ ప్రతికూల వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో నిర్మాణ పనులను వేగవంతం చేస్తూ నిర్దేశిత నాణ్యత ప్రమాణాలను తప్పని సరిగా పాటించాలని సూచించారు. నిర్మాణ పనుల్లో ఎటువంటి జాప్యాలకు తావివ్వరాదని ఆయన స్పష్టం చేశారు. వంతెన వసతులను జిల్లా వాసులకు అందుబాటులోకి తీసుకొని వచ్చి ట్రాఫిక్ రద్దీని నియంత్రించాలని ఇంజనీర్లను సూచించారు. ఆర్‌అండ్‌బీ జిల్లా సూపరింటెండెంట్ ఇంజనీర్ బి.రాము, ఇతర అధికారులున్నారు.

విద్యా కిట్ల పంపిణీకి కార్యాచరణ

మామిడికుదురు: డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్ల పంపిణీకి కార్యాచరణ రూపొందించాలని డీఈవో షేక్ సలీంబాషా సూచించారు. లూటుకుర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్టాక్ పాయింట్‌ను డీఈఓ మంగళవారం పరిశీలించారు. విద్యార్థి మిత్ర కిట్ల ద్వారా ఆరు రకాల వస్తువులను విద్యార్థులకు ఉచితంగా అందిస్తామని డీఈఓ తెలిపారు. ఈ కిట్లకు సంబంధించి విద్యార్థులకు అందించే బుక్స్, బెల్టులు వచ్చాయని మిగిలిన వస్తువులు త్వరలోనే స్టాక్ పాయింట్లకు చేరవేస్తామన్నారు. ఆరు రకాల వస్తువులతో కిట్లను సిద్ధం చేసి పెట్టుకోవాలని సూచించారు. పాఠశాలలు పునః ప్రారంభం తర్వాత అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఈ కిట్లను అందిస్తామన్నారు. కిట్ల పంపిణీలో ఎటువంటి అలసత్వం వహించకూడదని హెచ్ఎంలకు డీఈఓ సూచించారు. ఒకటి నుంచి పదో తరగతి వరకు మండలంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్న విద్యార్థులు 3,343 మంది ఉన్నారని ఎంఈఓలు సీహెచ్ లక్ష్మీనారాయణ, మోకా వెంకన్న బాబు డీఈఓకు తెలిపారు.

సాగునీరు పారేదెలా..?

- వ్యర్థాలతో పూడిపోయిన పంట కాలువలు
- పూడికతీత చర్యల్లో అలసత్వం
- ఆందోళన చెందుతున్న అన్నదాతలు



వి.సావరంలో పంట కాలువ దుస్థితి

రాయవరం: రబీ పనులు పూర్తి కావచ్చాయి. కొద్ది రోజుల్లో సార్వా పనులకు రైతన్నలు సన్నద్ధమవుతారు. జూన్ ఒకటో తేదీన కాలువలకు నీరు వదలాల్సి ఉంటుంది. విడుదలైన నీరు వడివడిగా పంట కాలువల ద్వారా చేలల్లోకి చేరే పరిస్థితులు కానరావడం లేదు. దానికి కారణం పంట కాలువలు చెత్తాచెదారం..తూటికాడతో నిండిపోయాయి. నీటి విడుదలకు ముందే కాలువల్లో పూడికను తీయించాల్సిన అధికారులు అందుకు తగిన చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు రైతుల నుంచి వినవస్తున్నాయి.

పూడిపోయిన కాలువలు

మండలంలో సుమారుగా 15,600 ఎకరాల్లో వరి సాగు జరుగుతుంది. మండలంలోని పొలాలకు మండపేట, కోరంగి, కాకినాడ ప్రధాన కెనాళ్ల ద్వారా వెదురుపాక, రామవరం, సోమేశ్వరం నం.1 చానల్, మాచవరం న్యూ చానల్, గయ్యాళి చానల్, పాత బోడవరం చానల్, నదురుబాద నం.1, 2, 3 చానళ్లు, ఉ్రటుమిల్లి తదితర చానళ్ల ద్వారా చేలకు నీరందుతుంది. మండలంలోని ఆయా చానళ్లు పిచ్చిగడ్డి, గుర్రపుడెక్క, తూటికాడ వంటి చెత్తాచెదారంతో నిండిపోయాయి. దీంతో కాలువల్లో నీరు పారే అవకాశం లేదు. వీలైనంత తొందరగా ఖరీఫ్ పనులు ప్రారంభిద్దామనుకుంటున్న రైతులకు పంట కాలువలు పూడిపోవడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



తాపేశ్వరం హైలెవెల్ కాలువ వద్ద చేపట్టిన పనులు

ఉపాధి హామీలోనైనా చేపట్టాలి

మండలంలోని వివిధ చానళ్లలో పూడికతీత తీయించేందుకు ఉపాధిహామీ పథకంలోనైనా పనులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. ఖరీఫ్ పనుల్లో భాగంగా రైతులు నారుమళ్లు వేసుకునేలోగానే కాలువల్లో పూడికతీత, తూడు, గుర్రపుడెక్క, వ్యర్థ పదార్థాలను తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు. కాలువలకు నీరు విడుదలైన తర్వాత పూడికతీత పూర్తిస్థాయిలో తీయడం ఎలా సాధ్యమవుతుందని రైతులు సిరికి కృష్ణారావు, చేవా సత్యనారాయణ, వుండవిల్లి రామకృష్ణ, కొవ్వూరి శ్రీనివాసరెడ్డి తదితరులు ప్రశ్నిస్తున్నారు. అరకొరగా పనులు చేసి అధికారులు చేతులు దులుపుకొంటారేమోనన్న అనుమానాన్ని రైతులు వ్యక్తం చేస్తున్నారు. నీటి విడుదల సమయానికే సాగునీరు వచ్చే చానళ్లను అభివృద్ధి చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

కాలుష్య కాసారాలుగా..

ప్రస్తుతం కాలువలన్నీ కాలుష్య కాసారాలుగా మారిపోయాయి. గతంలో గ్రామాల మధ్య నుంచి వెళ్లే కాలువల నుంచి మంచి నీరును సేకరించుకుని వినియోగించుకునేవారు. కాని ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. గ్రామాల మధ్య నుంచి వెళుతున్న కాలువల్లోకి వ్యర్థ పదార్థాలు చేరుతుండడంతో కాలువలు కాలుష్య కాసారాలుగా మారుతున్నాయి.

ప్రజలు వాడుతున్న ప్లాస్టిక్ వ్యర్థాలు విపరీతంగా చేరిపోతున్నాయి. వాటిని సమీపాన ఉన్న పంట, మురుగు కాలువల్లోకి నెట్టుతున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో కాలువలన్నీ వ్యర్థాలతో పూడిపోయి నీటి ప్రవాహానికి ఆటంకంగా మారుతున్నాయని రైతులు వాపోతున్నారు.

నీరు వదిలేలోగా పూర్తి

“కాలువల మరమ్మతులకు సంబంధించిన ప్రతిపాదనలు ఉన్నతాధికారుల ఆమోదం లభించింది. పనులు కూడా ప్రారంభించాం. కాలువలకు నీరు వదిలేలోగా పనులు పూర్తి చేస్తాం.

– అజీజ్, ఏఈ, నీరు పారుదల శాఖ, తాపేశ్వరం సెక్షన్

పూడికతీత పనులు చేపడుతున్నాం

ఉపాధి హామీ పథకంలో పంట బోదెల్లో పూడికతీత పనులు చేపడుతున్నాం. ప్రధాన, మైనర్ కాలువలను వెడల్పు చేయడం, పూడికతీత పనులు చేపడుతున్నాం. ప్రస్తుతం పనులకు అనుకూలంగా ఉండడంతో వేగంగా పనులు సాగుతున్నాయి.”

– జనిపల్లి సుధారాణి, ఏపీవో, ఎన్ఆర్ఈజీఎస్, రాయవరం మండలం

ఆర్డీఓ స్థల పరిశీలన



రాయవరంలో స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ

రాయవరం: మండలంలోని రాయవరం, లొల్ల గ్రామాల్లో నూతనంగా ఏర్పాటు చేయనున్న బల్క్ మిల్క్ సెంటర్ల కోసం రామచంద్రపురం ఆర్డీఓ దేవరకొండ అఖిల మంగళవారం స్థల పరిశీలన చేశారు. బల్క్ మిల్క్ సెంటర్ల కోసం స్థలాలు అనుకూలమా, కాదా అని అధికారులతో కలసి పర్యవేక్షించారు. అనంతరం గ్రామంలోని విశ్వ మానవత ఆశ్రమాన్ని సందర్శించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఐపీ శెట్టి, సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న దీక్ష



కేశవరంలో దీక్ష చేస్తున్న శ్రీవాణి

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట మండలం డి.కేశవరంలో స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలకు రక్షణ గోడ నిర్మించాలన్న డిమాండ్‌తో గ్రామానికి చెందిన మహిళ వల్లూరి శ్రీవాణి చేపట్టిన రిలే నిరాహార దీక్ష మంగళవారంతో 33వ రోజుకు చేరింది. నూతన విద్యా సంవత్సరం వచ్చే నెలలో ప్రారంభం కానున్న నేపథ్యంలో తన డిమాండ్‌ను పరిష్కరించి, త్వరితగతిన పాఠశాలకు రక్షణ గోడ నిర్మించాలని శ్రీవాణి సంబంధిత అధికారులను కోరారు.

ఆందోళనలో అన్నదాత



కె.గంగవరంలో జోరుగా కురుస్తున్న వర్షం

కాజులూరు: మండల గ్రామాల్లో మంగళవారం ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. తెల్లవారుజామున ప్రారంభమైన వర్షం రాత్రి వరకూ విడవకుండా కురుస్తూనే ఉంది. మండల గ్రామాల్లో పలు చోట్ల చెట్లు విరిగిపడగా పలు చోట్ల విద్యుత్ స్తంభాలు నేలకొరిగి వైర్లు తెగిపడ్డాయి. దీంతో పలు పల్లెగ్రామాలకు రాకపోకలు స్తంభించిపోయాయి. స్థానికులు స్వచ్ఛందంగా రోడ్లపై విరిగిపడిన చెట్టుకొమ్మలను తొలగించుకుని మార్గాలను సరిచేయగా ట్రాన్స్‌కో సిబ్బంది విద్యుత్ స్తంభాలను, వైర్లను సరిచేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. వర్షాల ప్రభావం జిల్లాలో మరో రెండు రోజుల పాటు తీవ్రంగా ఉంటుందని వాతావరణం నిపుణులు సూచిస్తున్న తరుణంలో మంగళవారం కురిసిన వర్షం ప్రజలు, రైతులను మరితం భయాందోళనలకు గురిచేస్తోంది.

అన్నదాతకు అపారనష్టం:

నియోజకవర్గంలో గత కొన్నేళ్లుగా సాగు చివరి దశలో సంభవిస్తున్న అల్పపీడనాలు, తుపాన్లు రైతన్నలను తీవ్ర నష్టాలకు గురిచేస్తున్నాయి. గత తొలకరి చివరి దశలో కురిసిన వర్షాలకు పంట కోతకు పనికి రాకుండా పూర్తిగా నష్టపోగా ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు మరింత కలవరానికి గురిచేస్తుంది. కాజులూరు మండల గ్రామాల్లో సుమారు 90 శాతం పంట మాసూళ్లు నిర్వహించారు. మిగిలిన పంట కోత దశకు సిద్ధంగా ఉంది. గ్రామాల్లో కొందరు రైతులు వరి కుప్పలుగానూ, కొందరు మాసూళ్లు చేసిన ధాన్యాన్ని కళ్లాలపైన, రోడ్ల వెంబడి ఆరబెడుతున్నారు. ఈదురుగాలులతో కూడిన వర్షం వరి కుప్పలుగానూ, ధాన్యం రాశులుగానూ ఉంచిన పంటకు తీవ్రనష్టం కలగజేసింది. వర్షానికి మాసూళ్లు నిర్వహిస్తున్న ధాన్యం తడిసి ముద్దయింది. కళ్లాల్లో ఆరబెట్టిన తడిసిన ధాన్యాన్ని రాశులుగా చేసి గడ్డి మూత వేసేందుకు రైతులు నానాతంటాలు పడ్డారు. ఇప్పటికైనా వర్షాలు తగ్గి పంట సురక్షితంగా ఒడ్డుకు చేరాలని రైతులు కోరుకుంటున్నారు.

కుండపోత

కె.గంగవరం: మండలంలోని అన్ని గ్రామాల్లో మంగళవారం ఏకధాటిగా కుండపోత వర్షం కురిసింది. మంగళవారం తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకు ఎడతెరిపి లేకుండా వర్షం పడడంతో జనజీవనం పూర్తిగా స్తంభించింది. రోజంతా వాన కురవడం వల్ల భట్లపాలిక, కోట, కె.గంగవరం, అద్దంపల్లి తదితర గ్రామాల్లోని పల్లపు వీధులు జలమయమయ్యాయి. ఏకధాటిగా వర్షం కురవడంతో జన సంచారం లేక రోడ్లన్నీ నిర్మానుష్యమయ్యాయి. ఉదయం నుంచి వర్షం కురవడంతో సామాన్య ప్రజలు ఇబ్బందులు పడ్డారు. మండలంలో ప్రధాన కాలువలు టేకి డ్రెయిన్, రాజుకాలువ, పాణింగపల్లి పాత కాలువలు వర్షపు నీటితో పరిది దాటి ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. పల్లపు భూములున్న అముజూరు, కోటిపల్లి, పేకేరు, భట్లపాలిక తదితర గ్రామాల్లోని ధాన్యపు రాశులు నీట మునిగాయి. అల్పపీడనంతో మరో రెండు రోజులు వర్షాలు పడతాయని వాతావరణ శాఖ హెచ్చరించడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.



గొల్లపాలెంలో ఈదురు గాలుల బీభత్సం



కాజులూరులో పంట చేలోనే ఉండిపోయిన ధాన్యం రాశులు

మట్టిలో దిగబడిన ఆర్టీసీ బస్సు



ఆర్అండ్‌బీ రోడ్డులో దిగబడిన బస్సు

మలికిపురం: మండలంలోని లక్కవరం–చింతలపల్లి ఆర్అండ్‌బీ రోడ్డులో ఆర్టీసీ బస్సు దిగబడింది. ఇటీవల ఈ రోడ్డు పనులు ప్రారంభించి అనంతరం అధికారులు నిలిపివేశారు. రోడ్డు బెర్మ్‌లు తవ్వి మట్టిని మరలా పూడ్చి వేశారు. లూజ్ మట్టిని వాహనాలు గమనించకపోవడంతో పాటు రోడ్డు ఇరుకుగా ఉండడం వల్ల బస్సు దిగబడింది. దీంతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు.

లేబర్ కోడ్‌ల రద్దే శ్రామికుల లక్ష్యం



మండపేటలో ఆందోళన తెలుపుతున్న కార్మికులు

కపిలేశ్వరపురం (మండపేట): కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేసే వరకూ ఉద్యమించడమే శ్రామిక వర్గం లక్ష్యం కావాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి కె.కృష్ణవేణి అన్నారు. సంఘ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం మండపేట మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. శ్రామికవర్గ ప్రయోజనాలను దెబ్బతీసే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలంటూ నినాదాలు చేశారు. అన్ని విభాగాల్లో పనిచేసే కార్మికులందరికీ కనీస వేతనం రూ.26 వేలకు పెంచాలన్నారు.

కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ వారిని శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. వివిధ ప్రభుత్వ పథకాల్లో పనిచేస్తున్న అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు, సిబ్బంది, డ్వాక్రా యానిమేటర్లు, స్కూల్ కంటెజెంట్ వర్కర్లందరినీ నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. ఎన్‌డీఏ ప్రభుత్వం తెస్తున్న ప్రజా వ్యతిరేక చట్టాలను నిలువరించడంలో టీడీపీ, జనసేన పార్టీలు విఫలమయ్యాయన్నారు. కార్యక్రమంలో సంఘ మండపేట పట్టణ కన్వీనర్ నరేంద్ర, పి.లోవరాజు, మణికంఠ, గణేష్, డి.సురేష్, వెంకటలక్ష్మి, ధూళి రమేష్, చిన్నారమ్మ పాల్గొన్నారు.

గోదారి గట్టు ఛిద్రం

- ఇసుక లారీల రాకపోకలే కారణం
- పట్టించుకోని పాలకులు



తాతపూడి-కపిలేశ్వరపురం మధ్య ఛిద్రమైన గోదావరి గట్టు రహదారి

కపిలేశ్వరపురం: ఆలమూరు మండలం జొన్నాడ నుంచి యానాం వరకూ గౌతమి గోదావరి గట్టు అనేక చోట్ల ఛిద్రమైంది. ప్రయాణికులు అటుగా వెళ్లేందుకు బెంబేలెత్తుతున్నారు. దానికితోడు ఇసుక లారీల జోరు తోడైంది. గోదావరి నదిలో తోడేస్తున్న ఇసుకను కపిలేశ్వరపురం, తాతపూడి ర్యాంపుల వద్ద గోదావరి గట్టును ఆనుకుని గుట్టలుగా నిల్వ ఉంచుతున్నారు. ఇక భారీ వాహనాల్లో రోజువారీ తరలింపు విచ్చలవిడిగా సాగుతోంది. కూటమి ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి ఇసుక రవాణాకు అడ్డూఅదుపూ లేకుండా పోయింది. ఇదిలా ఉంటే ఇసుక తరలింపు దాహానికి గోదావరి గట్టు, గ్రామాల్లోని రహదారులు ఛిద్రమవుతున్నాయి. ముఖ్యంగా గౌతమి గోదావరి గట్టు ధ్వంసమవుతోంది. జొన్నాడ నుంచి కపిలేశ్వరపురం వరకూ పలుచోట్ల రహదారి మార్జిన్లు దెబ్బతిన్నాయి. మధ్యలో గుంతలు ఏర్పడ్డాయి. ద్విచక్ర వాహనదారులు జారిపడుతున్నారు. రహదారుల పరిస్థితి ఇంత దారుణంగా ఉన్నా, సుదూర ప్రాంతాలకు ఇసుక తరలింపును మాత్రం ఆపడం లేదు. రహదారుల దుస్థితిపై స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

హాస్టళ్లు మూసివేసి.. విద్యకు దూరం చేసి..

- విద్యార్థుల జీవితంతో ఆడుకుంటున్న ప్రభుత్వం
- కపిలేశ్వరపురంలో నిరుపయోగంగా హాస్టల్ భవనం
- తొలి నుంచీ టీడీపీది అదే వైఖరి
- హాస్టళ్లను తెరిపించాలని కోరుతున్న ప్రజలు



కపిలేశ్వరపురంలో మూతపడిన ఎస్సీ బాలికల హాస్టల్ భవనం

కపిలేశ్వరపురం: ప్రతి మనిషికి గాలి, నీరు, గూడు, నిద్రతోపాటు ఆధునిక సమాజంలో విద్య కూడా అత్యంత అవసరం. అందరూ సమానంగా ఉండాలని స్వేచ్ఛగా జీవించాలని భారత రాజ్యాంగం సామాజిక న్యాయానికి పెద్ద పీట వేసింది. విద్యకు దూరంగా ఉన్న దళిత, వెనుకబడిన సామాజిక వర్గీయులకు చెందిన చిన్నారుల కోసం ఎన్నో రిజర్వేషన్లు ఏర్పాటు చేసింది. వీరికి విద్య, వసతి గృహాలు నిర్మించారు. దీంతో వారి విద్యాభ్యాసం కొనసాగింది. అయితే ఆచరణలో పాలకులు ఆ దిశగా నడుచుకోకపోవడంతో అనేక సమస్యలు తలెత్తుతున్నాయి.

టీడీపీ ప్రభుత్వం వచ్చినప్పుడల్లా విద్య, వైద్యంపై ఖర్చును తగ్గించేస్తోంది. గతంలోనూ ప్రస్తుతం టీడీపీ పాలనా తీరును చూస్తే ఆ విషయం స్పష్టమవుతోంది. గతంలో 2014లో అధికారం చేపట్టిన టీడీపీ రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున సంక్షేమ హాస్టళ్లను ఎత్తివేసింది. దీంతో ఎంతో మంది విద్యార్థులు చదువుకు దూరమయ్యారు.

నియోజకవర్గంలో విద్యాలయాలు ఇలా

నియోజకవర్గంలోని మండపేటలో 68, కపిలేశ్వరపురంలో 51, రాయవరం మండలంలో 46 మొత్తం 165 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. ఆయా పాఠశాలల్లో సుమారుగా 13,219 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఆయా పాఠశాలల్లోని వందల మంది విద్యార్థులు క్షేత్రస్థాయిలో ఉండే వసతి గృహాల్లో ఉంటూ చదువుకునేవారు. పలు హాస్టళ్లను మూసివేతడంతో వసతికి దూరమయ్యారు.

సంక్షేమ హాస్టళ్ల ఆవశ్యకత ఇదీ..

తమ జీవితంపై, సమాజంలో తన పాత్రపై ప్రతి వ్యక్తికి అవగాహన కలగాలంటే కచ్చితంగా ఆ వ్యక్తికి చదువు ఉండాలి. ఆ చదువు వ్యాపారమయమైనప్పుడు పేద, మధ్య తరగతి ప్రజలు మరీ ముఖ్యంగా దళిత, వెనుకబడిన తరగతుల వారు విద్యకు దూరమవుతారు. వారికి విద్యను దరిచేర్చే లక్ష్యంతో ఎస్టీ ఎస్సీ, బీసీ సంక్షేమ హాస్టళ్లను ఏర్పాటు చేశారు. అలాంటి హాస్టళ్లను పాలకులు మూసేసే దిశగా ఉండడం బాధాకరం. నియోజకవర్గంలో దీర్ఘకాలంగా నిర్వహణలో ఉన్న పలు హాస్టళ్లను గత టీడీపీ ప్రభుత్వ హయాంలో మూతపడ్డాయి. గత్యంతరంలేక ఆయా వర్గాల విద్యార్థులు దూరపు ప్రాంతాలకు వెళ్లి చదువుకోవాల్సి వచ్చేది. 2025–26 విద్యా విద్యాసంవత్సరంలోనైనా మూతపడిన హాస్టళ్లను తెరవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

హాస్టళ్ల మూసివేత నేపథ్యమిదీ...

2015కు ముందు నియోజకవర్గంలో 11 ఎస్సీ, బీసీ వసతి గృహాలుండేవి. 2014లో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకా కపిలేశ్వరపురం, రాయవరం మండలాల్లోని ఆరు వసతి గృహాలు ఎత్తేశారు. మండపేటలోని ఎస్సీ, బీసీ బాలుర వసతి గృహాలను ఎత్తేసి ఆ విద్యార్థులను జెడ్.మేడపాడులోని ఇంటిగ్రేటెడ్ వసతిగృహంలో విలీనం చేశారు. రాయవరంలో బీసీ బాలురు, ఎస్సీ బాలురు, ఎస్సీ బాలికలు వసతి గృహాలుండేవి. వాటిలో బీసీ వసతి గృహానికి చెందిన విద్యార్థులను ద్వారపూడి ఇంటిగ్రేటెడ్ వసతిగృహానికి తరలించారు. కపిలేశ్వరపురం మండలంలో ఎస్సీ బాలురు, బీసీ బాలురు వసతి గృహాలుండేవి వాటిలో బీసీ బాలురు వసతి గృహాన్ని 2014కు ముందే మూసివేయగా 2015లో ఎస్సీ బాలురు, ఎస్సీ బాలికల వసతి గృహాలను ఎత్తేశారు. కపిలేశ్వరపురంలోని ఎస్సీ బాలికల వసతిగృహానికి పక్కా భవనం ఉండగా ప్రస్తుతం అది నిరుపయోగంగా మారింది. మూసివేతకు గురైన హాస్టళ్లను తెరవాలని ప్రజలు కోరుతున్నారు.

బాధ్యతగా ఉండాలి



హాస్టళ్ల మూసి వేతతో విద్యార్థులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. అయినా విద్య, వైద్యంపై వెచ్చించే దాన్ని ప్రభుత్వం ఖర్చుగా భావించకూడదు. వాటిని బాధ్యతగా ప్రభుత్వం అమలు చేయాలి. ఆ రెండు రంగాలే మెరుగైన సమాజం ఏర్పాటుకు దోహదపడతాయి. పేద, మధ్య తరగతి చిన్నారులు చదువుకునే ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేయాలి.

– పసలపూడి శ్రీనివాస్, శాలివాహన సంఘం జిల్లా నాయకుడు, అంగర, కపిలేశ్వరపురం మండలం.

హాస్టళ్లను తెరిపించాలి



నియోజకవర్గంలో పలు ఎస్సీ, బీసీ వసతి గృహాలు మూసివేతతో దళిత, బలహీన సామాజికవర్గాలకు చెందిన పిల్లలు తీవ్ర యాతనకు గురయ్యారు. మారుతున్న పరిస్థితుల్లో విద్య వైద్యం అత్యంత అవసరం. ఆ నేపథ్యాన్ని దృష్టిలో పెట్టుకొని నూతన విద్యాసంవత్సరంలోనైనా నియోజకవర్గంలో హాస్టళ్లను తెరిపించాలి.

– పిప్పర సంపదరావు, దళిత నాయకుడు, కపిలేశ్వరపురం.